

# ఆశలు రేపిన కుంకుమభరిణె

శ్రీమతి ఇసుకపల్లి లక్ష్మీసావిత్రి

వాకిట్లో కారు ఆగింది. జడవేసుకుంటున్న కమల ఆత్రంగా వాకిట్లోకి వచ్చింది. అటూ ఇటూ చూసింది. ఇరుగు పొరుగు వాళ్ళెవరు కనిపించలేదు. తేలికగా నడచుకుంటూ గేటుదాకా వచ్చింది.

'రండి రమణమ్మగారూ' అంటూ పిలిచింది.

కారులోనుంచి నలుగురైదుగురు పేరంటాళ్లు దిగారు. వాళ్ళతో కలిసి ఇంట్లోకి పోబోతుంది. పక్కింటి పార్వతమ్మ అప్పుడే బయటనుంచి నీళ్లు తెస్తోంది. ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నా, ఏమీ మాట్లాడుకోకుండా లోపలకు వెళ్ళిపోయారు.

వచ్చిన పేరంటాళ్లు సారెపెట్టి వెళ్ళిపోయారు. కమల వస్తువులన్నింటినీ పరకాయించి చూసింది. పసుపు, కుంకుమ, కుంకుడుకాయలు, నూనె,... వెండికుంకుమ భరిణె; కమల కళ్లు జిగేలుమన్నాయి. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. తన స్నేహితులు చాలా గొప్ప ఇంటివాళ్లు. ఆయనకు పెద్ద వుద్యోగం; ఎప్పుడు కారులో తిరుగుతారు. వాళ్ళు తమయింటికి కారులో రావటం తనకు గర్వకారణం. ఇరుగు పొరుగు వాళ్ళకు ఈర్ష్యాహేతువు గూడాను.

"మీకేమమ్మా.... పెద్ద పెద్ద ఉద్యోగస్తులతో పరిచయం అని తెలిసినవాళ్ళు బహిరంగంగా అభిప్రాయాలు వెల్లడించిన సందర్భాలుకూడా ఉన్నాయి. కమల ఆనందంతో పొంగిపోతుంది.

ఏదో దురదృష్టంకొద్దీ చిన్న ఉద్యోగంచేసే భర్తను పొందటంవలన పేదవాళ్ళమధ్య ఉండవలసి

వచ్చింది. గాని తన స్నేహితురాళ్ళంతా పెద్ద ఇళ్ళలోకే వెళ్లారు. ఇవన్నీ గర్వకారణాలు. తాహతు ఉన్నప్పుడు గర్వపడినా తప్పులేదు. దమ్మిడీకి పనికిరానివాళ్లు గర్వంగా మాట్లాడితే వళ్లుమంట. ఈ మాట ఒకటి రెండుసార్లు అన్నదిగూడా. "ఏం చూసుకుని ఆ మిడిసిపాటు?" అని, పార్వతమ్మగారు సమాధానం చెపుదామని ముందుకు తూగినా తమాయించుకుంది. కమల తన మాటలో ఉన్న సత్యమే పార్వతమ్మగారి నోరు మూయించింది అనుకుంది.

అవన్నీ ఒకెత్తు. ఇదొకఎత్తు. వెండికుంకుమ భరిణెలు సారెలో పంచటం తను విని ఎరుగదు. కారులో వచ్చి తనకి ఇచ్చి వెళ్ళారు. బహుశా అందరికీ ఇలా వెండివి ఇచ్చి ఉండరు. అందరికి లక్కపిడతలు ఇచ్చి, ఏదో కొద్దిమంది ముఖ్యులకుమాత్రం ఇలా ఇచ్చి ఉంటారు. అయినా తన తాహతుకు భర్త ఉద్యోగం చిన్నది అయిందిగాని వెండిభరిణె ఇవ్వటం సమంజసంగూడా అనుకుంది కమల. పసుపు కుంకుమ అలమారలో సర్దింది. వెండి కుంకుమభరిణె పట్టుకోగానే తనలో విద్యుత్తు ప్రవహించినట్లుంది. ఆ మెరుపు.... అనగిషీ.... అద్దంముందు నిలబడి అందులోని కుంకం ముఖాన దిద్దుకుంది. ఆ భరిణెతో నిలబడితే ఎంతఠీవిగా ఉంది తను.

కమల ఆ భరిణె అలమారలో పెట్టలేకపోయింది.

మెల్లిగా పార్వతమ్మ దగ్గరకు వెళ్ళి 'పిన్నిగారూ....' అంటూ పిలిచింది. పార్వతమ్మ పొయ్యి విసురుతున్నదల్లా ఆ పని ఆపి విసనకర్రతోసహా వాకిట్లోకి వచ్చింది.

'ఏమిటమ్మా కమలా'....

'ఏంలేదు పిన్నిగారూ.... బొట్టు పెట్టించుకుని పోదురు గాని!'

'ఏమన్నా పేరంటమా కమలా మీ ఇంట్లో....' అని 'చెయ్యి కడుక్కుని వస్తానుండు....' అంటూ పార్వతమ్మ లోపలకు పోయివచ్చింది.

కమలకు ఆ నాలుగు క్షణాలు నాలుగు యుగాల్లాగా అనిపించింది. పార్వతమ్మ రాగానే కుంకుమ పెట్టి 'భరిణె బావుందా పిన్నీ...' అంది.

బావుందిగాని... ఏమిటి పేరంటమా....' అని అడిగింది పార్వతమ్మ.

'సారెలో పంచి వెళ్లారులెండి.'

పార్వతమ్మ ముక్కుమీద వేలేసుకుంది. ఆ భరిణె తీసుకుని పరిశీలనగా చూస్తూ 'ఇందాక కారులో వచ్చిన వారేనా...' అంది.

'అవును పిన్నిగారూ...' కమల ఆ మాటలు అంటూ భరిణెవంక కన్నార్పకుండా చూసింది.

'వెండిభరిణె....' అంది పార్వతమ్మ ఇంకా తెల్లబోతూ-

'వాళ్ల ప్రేమ అలాంటిది....' అంది కమల.

'అవునవును.... మీ ఇంటికి చాలాసార్లు రావటం చూశాను.

'ఎప్పుడూ వస్తూనే ఉంటారు..... ఆవిడా, నేనూ చిన్నప్పటినుంచి కలిసి ఆడుకునేవాళ్లం...' అంది కమల.

'అలాగా... మళ్లా వస్తానమ్మా కమలా.... గిన్నె కాలిపోతుంది. అక్కడ ఇన్ని నీళ్లన్నా పెట్టివస్తాను....' అంది పార్వతమ్మ.

'పని చూసుకోండి పిన్నిగారూ!.... నాకూ బోలెడంత పని ఉంది' అంది కమల. నిజానికి ఇంట్లో పనేమీలేదు. ఇంట్లోకి వెళ్లింది. భరిణె అలమారాలో పెట్టింది. వాకిట్లోకి వచ్చింది.

దొడ్లోకి వెళ్లింది. వసారాగదిలో కూర్చుంది. ఎక్కడకు వెళ్లినా ఆ భరిణె మెదడులో మెదులుతోంది. సుబ్బమ్మగారింటికి, వెంకాయమ్మగారింటికి పోయి ఆ సంగతి చెప్పాలి. ఎట్లా చెప్పాలి? అదీ సమస్య. రిహార్సలు వేసుకుంది.

'ఏం కమలా ఇలా వచ్చావు?....' అని అడుగుతారు.

'ఎరుగున్నవాళ్ళు వచ్చి ఇప్పుడే వెళ్ళారు... కాలక్షేపానికని ఇట్లా వచ్చాను' అనాలి తను.

'ఎరుగున్నవాళ్లంటే ఎవరు?....' అని అడుగుతారు.

'అదే కారులో వస్తుంటారు....' అంటుంది తను.

'ఆహా....' అని ఊరుకుంటే తనే మళ్ళీ కల్పించుకుని 'సారె పెట్టిపోవటానికని వచ్చారు.' అని చెప్పాలి.

'ఏం పెట్టారేమిటి....?' అని వాళ్లు అడిగితే కుంకుమ భరిణె అని చెప్పాలి.

మళ్లా సమస్య.

'సారె అంటే ఏమీలేదు... పసుపు, కుంకుమా... వెండికుంకుమభరిణె....' అని తను అనాలి.

'ఏదీ... తెచ్చావా...?' అని అడుగుతారు.

'అలమారలో పెట్టివచ్చాను... మా ఇంటికి వచ్చి చాలారోజులయింది... ఒకసారి రండి. భరిణె చూసిపోదురుగాని... అనచ్చు...' అనుకుంది కమల. రిహార్సలు బాగానే పనిచేసింది. పొద్దుగూకేలోపునే పేటలోని ముత్తైదువులంతా వచ్చి ఆ భరిణెను, కమలకున్న గొప్ప స్నేహితురాళ్ళను యథాశక్తి పొగిడారు. కమల ఆ పొగడ్తలన్నిటినీ నిర్లిప్తంగా అందుకుంది.

అంతా వెళ్లిపోగానే, ఇంట్లో దీపం వెలిగించి, కుంపటి రాజెయ్యటానికి కొబ్బరిపీచుకోసం వెతుకుతోంది. ఎక్కడా కనబడలేదు. ఏదన్నా కాగితం దొరుకుతుందేమోనని వాకిట్లోకి వచ్చింది. వాకిట్లోకి రాగానే కారు అక్కడకు వచ్చి ఆగింది. కమల కారులోకి చూసింది. అందులో ఎవరూ లేరు. డ్రైవరు మెల్లిగా దిగివచ్చి నమస్కరించాడు.

'అమ్మగారు రాలేదేం....?' అని అడిగింది కమల

'ఇంట్లో ఉన్నారండి.... ఇందాక మీఇంటికి వచ్చినప్పుడు వెండి కుంకుమభరిణి మరిచిపోయి వచ్చారని, తీసుకుని రమ్మన్నారండి....' కమల కాళ్ళకింద భూమి కదిలిపోయినట్లయింది. దిగ్గున పక్కన చూసింది. ఎవరన్నా ఆ మాటలు విన్నారేమోనని. ఎవరూ లేరు. గబగబా లోపలకుపోయి భరిణెను బ్యాగులో దాచి తీసుకునివచ్చి అతని చేతికి ఇచ్చేసింది. డ్రైవరు మళ్లీ నమస్కరించి కారుమీద వెళ్లిపోయాడు.

కమల ఇంట్లోకి పోతుండగా పార్వతమ్మ వాకిట్లోకి వచ్చి లాంతరు వెలిగించి తీగెకు తగిలించింది. కమల గజగజ వణికిపోయింది.

'కారు మళ్లీ వచ్చినట్లుంది....' అంది పార్వతమ్మ.

'అవును...' అంటూ సంభాషణ పెరగకుండా ఒక్క దూకులో ఇంట్లోకి వెళ్లి భరిణె పెట్టిన అలమారవంక చూస్తూ కుప్పగా కూలిపోయింది.

(ఆంధ్రమహిళ)